సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 7 । డిసెంబర్ । 2024



చీనీ టన్ను రూ.36,100

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.36,100, కనిష్టంగా రూ.14 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.36

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.36, కనిష్టంగా రూ.20, సరాసరిన రూ.30 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం 34.7°/20.2°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలి ప్రభావం కనిపిస్తోంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

- మాల్యవంతం రెవెన్యూ సదస్సులో జేసీ అభిషేక్ కుమార్



సీఎం సందేశాన్ని చదివి వినిపిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

బత్తలపల్లి: గ్రామ స్థాయిలోనే భూ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని మాల్యవంతం గ్రామంలో తహసీల్దార్ స్వర్ణలత అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జాయింట్ కలెక్టర్.. ముందుగా 'మీ భూమి- మీ హక్కు' గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు సందేశాన్ని చదివి వినిపించారు. ప్రజలకు భూమితో ఉన్న అనుబంధం, భూ సమస్యలు, పరిష్కార మార్గాలను వివరించారు. భూ సమస్యలన్నీ పరిష్కరించేందుకు జిల్లాలోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు తమ భూ సమస్యలపై అర్జీలు ఇవ్వాలని సూచించారు. నిర్దేశించిన సమయంలోనే సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సదస్సులో డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి, డిప్యూటి తహసీల్దార్ షణ్ముఖకుమార్ యాదవ్, ఈఓఆర్డీ కిష్టప్ప, మండల సర్వేయర్ జోసఫ్, మాల్యవంతం సర్పంచ్ కుంటాల దేవి, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

శబరిమలకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

గుంతకల్లు: అయ్యప్ప మాలధారుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గుంతకల్లు జంక్షన్ మీదుగా శబరిమలకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్-కొట్టాయం (07163) మధ్య ఈ నెల 20, 27వ తేదీల్లో రైళ్లు నడుస్తాయన్నారు. హైదరాబాద్ జంక్షన్‌లో మధ్యాహ్నం 1.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 6.45 గంటలకు కొట్టాయం చేరతాయన్నారు. తిరిగి అక్కడి నుంచి 21, 28వ తేదీల్లో నడుస్తాయన్నారు. రాత్రి 9.45 గంటలకు రైలు బయలుదేరి హైదరాబాద్ జంక్షన్‌కు మరుసటి రోజు అర్ధరాత్రి 12.30 గంటలకు చేరుతుందన్నారు. బేగంపేట్, లింగంపల్లి, శంకరపల్లి, వికారాబాద్, తాండూరు, యాదగిరి, కృష్ణ, రాయచూరు, మంత్రాలయం, ఆదోని, గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లి, పీలేరు, పాకాల, చిత్తూరు, కాట్పాడి, జోలార్‌పేట్, సేలం, ఈరోడ్, తిరుపూర, పాల్కడ్, తిరుసుర్, ఎర్నకోలం టౌన్ మీదుగా ప్రయాణిస్తుందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పద్ధతి మార్చుకోకపోతే వేటు తప్పదు

- సచివాలయ ఉద్యోగులను హెచ్చరించిన మంత్రి సవిత



మాట్లాడుతున్న మంత్రి సవిత

సోమందేపల్లి: ''సచివాలయ ఉద్యోగులు సరిగా పనిచేయడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయి. ఇప్పటికైనా వారు పద్ధతి మార్చుకుని బాధ్యతతో పనిచేయాలి. లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం'' అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత హెచ్చరించారు. శుక్రవారం ఆమె మండలంలోని నాగినాయని చెరువు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సచివాలయ ఉద్యోగులంతా సక్రమంగా పనిచేస్తే గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొనే సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం అవుతాయన్నారు. దీన్ని గుర్తించుకుని పనిచేయాలన్నారు. ఈ సందర్భంలోనే స్థానిక సచివాలయంలోని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ పనితీరుపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలా మాటలతో చెప్పనంటూ హెచ్చరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అర్జీలకు 45 రోజుల్లో పరిష్కారం

కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎక్కువ భాగం రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు అందుతున్నాయన్నారు. అందుకే ప్రభుత్వం రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా సదస్సులు నిర్వహిస్తోందన్నారు. 33 రోజుల పాటు జిల్లాలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులో నిర్వహిస్తామని, ప్రజల నుంచి అందే అర్జీలను పరిశీలించి 45 రోజుల్లో పరిష్కారం చూపుతామన్నారు. సదస్సులో ఆర్డీఓ అరుణ్ కుమార్, డీఎస్పీ వెకంటేశ్వర్లు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెడ్డి శేఖర్, సర్పంచ్ అంజి నాయక్ పాల్గొన్నారు.



గమ్మత్తు.. ప్రాణాలకు ముప్పు!



నవంబర్ 28న హిందూపురం తూమకుంట చెక్‌పోస్టు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృత్యువాత పడ్డారు. వీరి వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో సంఘటనా స్థలంలోనే యువకులిద్దరూ ప్రాణాలు వదిలారు. ఇద్దరూ వివాహితులు కావడంతో ఆ కుటుంబాలకు జీవనాధారం లేకుండా పోయింది. ట్రాక్టర్ డ్రైవర్ మద్యం మత్తులో ఉండటమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది.

పెనుకొండ మండలం గుట్టూరు వద్ద ఇటీవల ఇద్దరు యువకులు మద్యం మత్తులో ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా నడిపారు. బైక్ అదుపుతప్పడంతో రోడ్డు పక్కనే ఉన్న ఓ ఇంట్లోకి బైక్ సహా దూసుకెళ్లారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన యువకులిద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మద్యం వల్లే రెండు ప్రాణాలు గాల్లో కలిశాయి.

ప్రాణాలు తీస్తున్న మద్యం

- రోడ్డు పక్కనే వైన్స్.. ఊరూరా బెల్టుషాపులు
- ఫుల్లుగా తాగేస్తున్న మద్యం ప్రియులు
- మత్తులోనే వాహనంపై దూసుకుపోతున్న మందుబాబులు
- రోడ్డు ప్రమాదాల్లో జీవితం కోల్పోతున్న వైనం

సాక్షి పుట్టపర్తి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన మద్యం పాలసీని అమల్లోకి తెచ్చింది. ఊరూరా మద్యం దుకాణాలు ఏర్పాటు చేసింది. వాటికి అనుబంధంగా కాలనీల్లోనూ బెల్టు షాపులు భారీగా వెలిశాయి. ఫలితంగా మద్యం ప్రియులు పగలు, రాత్రి తేడా లేకుండా మద్యం మత్తులో ఉంటున్నారు. ఆ గమ్మత్తులోనే వాహనాలతో రోడ్డెక్కి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇంకొందరు శరీర అవయవాలు పోగొట్టుకుని జీవచ్ఛవాలుగా మిగులుతున్నారు. జిల్లా పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదాలను పరిశీలిస్తే ఎక్కువశాతం మద్యం మత్తులోనే జరిగినట్లు తెలుస్తోంది.

లెక్కలేనన్ని బెల్టు షాపులు

జిల్లా వ్యాప్తంగా 87 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఆయా దుకాణాల పరిధిలో అనధికారికంగా వెయ్యికి పైగా బెల్టు షాపులు ఉన్నట్లు అంచనా. ఒక్కో గ్రామంలో నాలుగైదు బెల్టు షాపులు కూడా నిర్వహిస్తుండటం గమనార్హం. చాలా దూరం వెళ్లే పని లేకుండా ఉన్న గ్రామంలోనే మద్యం అందుబాటులో ఉంటోంది. దీంతో అక్కడే తాగి మత్తులో పలు అఘాయిత్యాలకు కారకులు అవుతున్నారు.

రారమ్మని పిలుస్తున్న వైన్స్

చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం మద్యం దుకాణాల ఏర్పాటుకు ఇష్టానుసారం అనుమతులు ఇచ్చింది. ప్రధాన రహదారులకు 220 మీటర్లు, చిన్న రోడ్లకు 120 మీటర్ల దూరంలో మద్యం దుకాణాలు ఉండాలి. కానీ జిల్లాలో ఎక్కడా ఆ నిబంధనలు అమలు కాలేదు. ప్రతి మండల కేంద్రంలోనూ ప్రధాన రహదారి పక్కనే మద్యం దుకాణం వెలిసింది. పగలు, రాత్రి తేడా లేకుండా ఎప్పుడు కావాలంటే అప్పుడు మద్యం దొరుకుతోంది. నిర్వాహకులు అక్కడే తాగేందుకు అనధికారికంగా రూములు కూడా ఏర్పాటు చేశారు. దీంతో మందుబాబులు ఫుల్లుగా తాగేసి ఆ మత్తులోనే వాహనంపై ఇంటి బాట పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే వాహనంపై నియంత్రణ కోల్పోతున్నారు. ప్రమాదాల బారిన పడి ప్రాణాలు విడుస్తున్నారు. ఒక్కోసారి అవతలి నుంచి వచ్చే వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

డ్రంకన్ డ్రైవ్ ఫుల్.. తనిఖీలు నిల్

'మద్యం దుకాణాల పర్మిట్లు ఇవ్వాల్సిందే. ఎక్కడ



పడితే అక్కడ దుకాణాలు నిర్వహించినా మౌనం పాటించాల్సిందే. దుకాణాల పక్కనే నిబంధనలకు విరుద్ధంగా రూములు ఏర్పాటు చేసినా అడగాల్సిన అవసరం లేదు. ఆయా మార్గాల్లో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు కూడా చేయకూడదు' ఇవీ.. కూటమి నేతల నుంచి ఎక్సైజ్ సిబ్బంది, పోలీసులపై ఉన్న ఒత్తిళ్లు. ఫలితంగా డ్రంకన్ డ్రైవ్‌లు కరువయ్యాయి. మద్యం దుకాణాల వైపు పోలీసులు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఫలితంగా ఏ దుకాణం సమీపంలో చూసినా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇంకొన్ని చోట్ల మద్యం దుకాణాలు మార్చాలని మహిళలు రోడ్డెక్కుతున్నా పట్టించుకోవడం లేదు. డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేయకపోవడంతో మందుబాబులు మత్తులోనే రోడ్డెక్కి ప్రమాదాలకు కారణం అవుతున్నారు.

ఎవరినీ వదిలేది లేదు



మద్యం తాగి వాహనం నడపటం నేరం. రోజూ సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయే వరకూ జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నాం. ఎక్కడికక్కడ తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తున్నాం. మద్యం తాగి వాహనం నడిపి పట్టుబడితే ఎవరినీ వదిలే ప్రసక్తే లేదు. తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందే. – వి.రత్న, జిల్లా ఎస్పీ

పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

రోజూ చీకటి పడిన తర్వాత జిల్లాలో ఎక్కడోచోట రోడ్డు ప్రమాదం జరుగుతోంది. మద్యం మత్తులో వాహనం నడపడమే ప్రమాదాలకు కారణంగా తెలుస్తోంది. పర్యవేక్షణ లేకపోవడం.. నియంత్రించాల్సిన పోలీసు వ్యవస్థ కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గడంతో మందుబాబుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ఒక్కోసారి రోడ్డుపై వెళ్తున్న వారిపై వాహనాలు దూసుకెళ్తుండటంతో అమాయకులూ చనిపోతున్నారు. ఫలితంగా ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంటోంది. ఇంటిపెద్దను కోల్పోతున్న కుటుంబం ఆదరణ కరువై రోడ్డున పడుతోంది.

వీఆర్‌ఓల వల్లే భూ సమస్యలు

- బాధ్యత లేకుండా పనిచేయడంతో ఇబ్బందులు
- భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు
- గోళాపురం పంచాయతీ సదస్సులో కలెక్టర్ చేతన్



సదస్సులో మహిళా రైతు నుంచి అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

హిందూపురం: ''వీఆర్‌ల వల్లే భూ సమస్యలు తలెత్తాయి. వారు బాధ్యత లేకుండా పనిచేయడం వల్లే ఇబ్బందులు వచ్చాయి. వీఆర్‌ఓలు సక్రమంగా, క్రమశిక్షణతో పనిచేస్తే సమస్యలనేవి ఉత్పన్నం కావు'' అని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శుక్రవారం హిందూపురం మండలంలోని గోళాపురం పంచాయతీలో నిర్వహించిన 'మీ భూమి–మీ హక్కు' రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ చేతన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సదస్సులో భాగంగా రెవెన్యూ సదస్సుల ముఖ్య లక్ష్యాన్ని మండల ప్రత్యేక అధికారి సోనీ సహాని వివరించారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భగా కలెక్టర్ మాట్లాడుతూ, శతాబ్దాల నాటి రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి భూ సమస్యలన్నీ పరిష్కరించే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అందుకే ఊరూరా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుల్లో రీ సర్వే వివరాలు, అడంగల్‌లో మార్పులు, చేర్పులు, నమోదు చేసిన సర్వే నంబర్లు, ఆర్‌ఎస్‌ఆర్ రికార్డులు, భూ ఆక్రమణలు, నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన వాటి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. మొత్తంగా రెవెన్యూ శాఖ పరిధిలోని 56 సర్వీసులు ఉచితంగా పొందవచ్చన్నారు. అలాగే రెవెన్యూ సదస్సులో ఇచ్చిన అర్జీకి సంబంధించి అధికారులు తీసుకున్న చర్యల సమాచారం కూడా నేరుగా అర్జీదారుడి సెల్‌ఫోన్‌కు సమాచారం అందుతుందన్నారు. వీఆర్‌ఓలు ఇప్పటికైనా సక్రమంగా పనిచేయాలని, భూముల వివరాలన్నీ రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. సదస్సులో ప్రజల నుంచి అందే ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి సమస్యను పరిష్కరించాలన్నారు. సదస్సులో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సర్పంచ్ దేవరాజ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆది నారాయణ, హౌసింగ్ ఏఈ నారాయణరెడ్డి, మండల సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా రైల్వే సంఘాల గుర్తింపు ఎన్నికలు

- 12న కౌంటింగ్



గుత్తి ఆర్‌ఎస్‌లో ఓటు వేస్తున్న రైల్వే కార్మికుడు

గుంతకల్లు/ గుత్తి: గుంతకల్లు డివిజన్ వ్యాప్తంగా మూడురోజులుగా జరుగుతున్న రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు రన్నింగ్ స్టాఫ్ ఉద్యోగులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. డివిజన్‌లో మొత్తం 14,359 మంది ఓటర్లు ఉండగా.. 11,509 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 86.05 శాతం పోలింగ్ నమోదైంది. ఈ నెల 12న ఓట్ల లెక్కింపు ఉంటుందని ఎన్నికల అధికారులు తెలిపారు.

ఫ్రాన్స్ అమ్మాయి.. గొల్లపల్లి అబ్బాయి



తలంబ్రాలు పోస్తున్న సందీప్‌యాదవ్

హిందూపురం: ప్రేమకు హద్దులు లేవని ఓ జంట నిరూపించింది. ఫ్రాన్స్ దేశస్తురాలైన ఆడ్ సవివ్, శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం గొల్లపల్లికి చెందిన గొల్లసందీప్ యాదవ్ శుక్రవారం మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. వీరి వివాహం హిందూ సంప్రదాయ పద్ధతిలో హిందూపురంలో ఘనంగా జరిగింది. గొల్లపల్లికి చెందిన సామాన్య రైతు కేశప్ప, గంగమ్మ 11వ సంతానమైన సందీప్ యాదవ్ ఫ్రాన్స్‌లోని యూనివర్సిటీ ఆఫ్ సీఎస్‌ఆర్‌లో సైంటిస్ట్‌గా స్థిరపడ్డారు. అక్కడ గూగుల్ సంస్థలో పనిచేస్తున్న ఫ్రాన్స్ దేశస్తురాలు ఆడ్ సవివ్‌తో పరిచయం కాస్తా ప్రేమగా మారింది. వీరి ప్రేమకు ఇరు కుటుంబాలు అంగీకారం తెలిపాయి. దీంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా వివాహం చేసుకున్నారు. సందీప్ యాదవ్ అన్న 'అక్షరమాల' శ్రీనివాసులు పెళ్లి పెద్దగా వ్యవహరించారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుద్దాం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఉషశ్రీచరణ్

సోమందేపల్లి: సమానత్వం, అందరికీ రాజ్యాంగ ఫలాలు అందించేందుకు అహరహం కృషి చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుద్దామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ పిలుపునిచ్చారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం సోమందేపల్లిలోని ఆ మహనీయుడి చిత్రపటానికి ఉషశ్రీచరణ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. బాబా సాహెబ్ రాజ్యాంగం ద్వారా అందరికీ భావప్రకటన స్వేచ్ఛను కల్పిస్తే... రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం దాన్ని హరిస్తోందన్నారు. దేశమంతా అంబేడ్కర్ రాజ్యాంగం అమలులో ఉంటే..రాష్ట్రంలో మాత్రం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ అమాయకులను వేధిస్తోందన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధనే ధ్యేయంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగించారన్నారు.

పెనుకొండలో రౌడీరాజ్యం

పెనుకొండలో రౌడీరాజ్యం నడుస్తోందని ఉషశ్రీ చరణ్ మండిపడ్డారు. ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించడమే లక్ష్యంగా మంత్రి సవిత వ్యవహరిస్తున్నారన్నారు. ఆమె భర్త వెంకటేశ్వర రావు దగ్గరుండి వైన్ షాపులు ప్రారంభించి బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్నారని దుయ్యబట్టారు. ఇటీవల పెనుకొండలో ముస్లింల శ్మశాన వాటిక స్థలం విషయంలో తల దూర్చిన మంత్రి భర్త రౌడీయిజం చేశారని, అందుకు పోలీసులు వత్తాసు పలికారన్నారు. ఇందుకేనా పెనుకొండ ప్రజలు ఓట్లు వేసి సవితను గెలపించారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని మరిచి ఇసుక అక్రమ రవాణా, బెల్ట్ షాపులు పెట్టి మద్యం రవాణా చేస్తోందని మండి పడ్డారు. కూటమి నేతల దౌర్జన్యాలను సహించేది లేదన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు గజేంద్ర, శ్రీనివాసులు, జెడ్పీటీసీ అశోక్, నరసింహ మూర్తి, ఈశ్వర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులపై మరో పిడుగు!

- రిజిస్ట్రేషన్ చార్జీల పెంపునకు సర్కారు కసరత్తు
- జనవరి నుంచి చార్జీల భారం
- కొన్ని ప్రాంతాల్లో 10 శాతం పెంచేందుకు ప్రతిపాదన
- ఇప్పటికే కుదేలైన స్థిరాస్తి రంగం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: సామాన్యులపై మరో పిడుగు వేసేందుకు కూటమి సర్కారు కసరత్తు చేస్తోంది. ఇటీవల కరెంటు చార్జీలు పెంచి సగటు జీవులకు షాక్ ఇచ్చిన చంద్రబాబు.. వచ్చే ఏడాది కొత్త సంవత్సరం కానుకగా రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచేందుకు యోచిస్తున్నారు. ఇప్పటికే అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఏ ఏ ప్రాంతాల్లో ఎంత మేరకు భూముల విలువ, ఎంత శాతం పెంచాలి అనే అంశాలపై కసరత్తు పూర్తయింది. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే జనవరి 1 నుంచి కొత్త చార్జీలు అమల్లోకి తెచ్చేందుకు యోచిస్తున్నారు. దీంతో ఇళ్లు, ఓపెన్ ప్లాట్‌లు, వెంచర్లలో స్థలాలు, భూములు కొనుగోలు చేసేవారికి మోయలేని భారం పడనుంది.

స్థిరాస్తి రంగం కుదేలు..

కూటమి సర్కారు ఏర్పడ్డాక స్థిరాస్తి రంగం కుదేలైంది. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో కొత్తగా వెంచర్లు వేసే నాథుడే కానరావడం లేదు. ఓపెన్ ప్లాట్‌లు కొనే వారు గగనమైపోయారు. అపార్ట్‌మెంట్లలో ఉన్న ఫ్లాట్‌లను అమ్ముకునేందుకు బిల్డర్లు నానా యాతన పడుతున్నారు. గతంతో పోల్చితే రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా వచ్చే ఆదాయంలో 60 శాతం పడిపోయింది. ఇలాంటి తరుణంలోనూ రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచి ఆదాయాన్ని పెంచుకోవాలని ప్రభుత్వం యోచిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

10 శాతం పైనే పెంపు..

రిజిస్ట్రేషన్ అధికారుల సమాచారం మేరకు ప్రస్తుతం ఉన్న రిజిస్ట్రేషన్ రుసుములో 10 శాతానికి పైగా పెంచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఓపెన్ ప్లాట్‌లు ప్రాంతాన్ని బట్టి ఒక్కో రేటు నిర్ణయించి ఉంటారు. ఆయా భూమి, లేదా ప్లాట్‌ను బట్టి కనిష్టంగా 9.5 శాతం రిజిస్ట్రేషన్ ఛార్జీలు చెల్లించాలి. అర్బన్ ప్రాంతాల్లో ఈ ధర మరింత ఎక్కువగా ఉంటుంది. మొత్తమ్మీద 10 నుంచి 15 శాతం చార్జీలు పెరిగితే మాత్రం ఒక చిన్న ప్లాట్ కొనాలన్నా భారీ మొత్తంలో రిజిస్ట్రేషన్ చార్జీలకే చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటికే టీడీపీ నేతల బెదిరింపులతో రియల్ ఎస్టేట్ వెంచర్లు ఎక్కడికక్కడ ఆగిపోయిన పరిస్థితి. ఇక చార్జీలు పెంచితే అసలు ఎవరూ ముందుకే రారని నిపుణులు చెబుతున్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేశాం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొన్ని ప్రాంతాల్లో భూముల విలువ సవరణ చేశాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే అమల్లోకి వస్తాయి. ఇప్పుడిప్పుడే రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు ఆశాజనకంగా సాగుతున్నాయి. అక్టోబర్, నవంబర్ నెలల్లో రెవెన్యూ రాబడి పెరిగింది. అహుడా అప్రూవల్ ఉన్నవి మాత్రమే అయితే ఆదాయం రాదు. అందుకే మున్సిపల్ పర్మిషన్ లేని వాటికి కూడా రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం. – భార్గవ్, జిల్లా రిజిస్ట్రార్

అనంతపురం జిల్లాలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు 12

ఈ ఏడాది రాబడి లక్ష్యం: రూ.469.65 కోట్లు

అక్టోబర్ వరకు వచ్చిన రాబడి: రూ.142.82 కోట్లు

శ్రీ సత్యసాయి జిల్లాలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు 09

ఈ ఏడాది రాబడి లక్ష్యం: రూ.248.55 కోట్లు

అక్టోబర్ వరకు వచ్చిన రాబడి: రూ.85.77 కోట్లు

క్లుప్తంగా

హోంగార్డుల సేవలు వెలకట్టలేనివి



ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులతో సమానంగా పనిచేస్తున్న హోంగార్డుల సేవలు వెలకట్టలేనివని ఎస్పీ రత్న అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో 62వ హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ రత్న.. హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరించి ప్లటూన్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, 1946లో వలంటీర్‌వ్యవస్థగా ఏర్పాటైన హోంగార్డుల వ్యవస్థ నేడు పోలీస్ వ్యవస్థలో కీలకంగా మారిందన్నారు. శాంతి భద్రతల పర్యవేక్షణ, నేర నియంత్రణ, ట్రాఫిక్, ఐటీ కోర్‌టీం, మోటర్ ట్రాన్స్‌ఫోర్ట్, ఫైర్ తదితర రంగాల్లో పోలీసులకు దీటుగా హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారని కొనియాడారు. ప్రస్తుతం జిల్లాలో 301 మంది హోంగార్డులు పనిచేస్తున్నారని, పోలీసులతో సమానంగా వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో హోంగార్డులకు రాయితీలో కూడిన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విధి నిర్వహణలో అమరులైన హోంగార్డు కుటుంబీకులకు రూ. 5 లక్షల ఆర్థిక సాయంతో పాటు ఒకరికి ఉద్యోగం ఇస్తున్నామన్నారు. హోంగార్డులు కూడా విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించకుండా పోలీస్ వ్యవస్థకు మంచి పేరు తీసుకొచ్చేవిధంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అలాగే విధి నిర్వహణతోపాటు కుటుంబంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

విజేతలకు బహుమతులు

హోంగార్డుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి ఎస్పీ రత్న ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు. పదవీ విరమణ పొందిన హోంగార్డులను సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్పీ శ్రీనివాసులు, డీఎస్పీ విజయకుమార్, సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఆర్ఐలు వలి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆవుల దొంగల అరెస్ట్

తాడిపత్రిరూరల్: గన్నెవారిపల్లి కాలనీ చెందిన ఆవులను ఎత్తుకెళుతున్న ఆరుగురు దొంగలను అరెస్టు చేశామని అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ శివగంగాధర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. గన్నెవారిపల్లి కాలనీలో ఉంటున్న కుళ్లాయప్పకు చెందిన రూ.1.20 లక్షల విలువైన నాలుగు ఆవులను అశోక్ లేలాండ్ వాహనంలో ఎత్తుకెళుతుండగా పట్టుకున్నామన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

నిండుకున్న ఇన్సులిన్

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో తీవ్రంగా కొరత
- నెల రోజులుగా డ్రగ్ స్టోరేజీకి ఆగిన సరఫరా
- ప్రైవేటులో కొంటున్న మధుమేహ వ్యాధిగ్రస్తులు
- ప్రభుత్వానికి ముందుచూపు కరువై అవస్థలు

- కణేకల్లుకు చెందిన రాము షుగర్ వ్యాధితో బాధపడుతూ ఇన్సులిన్ కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాడు. అయితే, అక్కడి సిబ్బంది ఇన్సులిన్ వాయిల్స్ ఖాళీ అయినట్టు చెప్పడంతో గత్యంతరం లేక బయట ప్రైవేటు మందుల దుకాణంలో కొనుగోలు చేశాడు.
- కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన వెంకటేశులు కొంతకాలంగా టైప్-1 మధుమేహంతో బాధ పడుతున్నాడు. రోజుకు రెండు సార్లు ఇన్సులిన్ తీసుకుంటున్నాడు. స్థానిక ఆస్పత్రిలో ఇన్సులిన్ అందుబాటులో లేకపోవడంతో బయట కొనుగోలు చేస్తున్నాడు. ఈ రెండు చోట్లే కాదు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న చాలా ఆస్పత్రుల్లో ఇదే పరిస్థితి. 20 రోజుల నుంచి ఇన్సులిన్ సరఫరా నిలిచిపోయింది.

రాయదుర్గం: ఉమ్మడి జిల్లాలోని 90 ప్రాథమిక ఆస్పత్రులు, 15 సీహెచ్‌సీ, 7 ఏరియా, ఒక సర్వజన వైద్యశాల పరిధిలో షుగర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్న వారు 11,645 మంది ఉన్నారు. ఆయా ఆస్పత్రుల్లో నెలలో సుమారు 1,400 నుంచి 1,500 ఇన్సులిన్ వాయిల్స్‌ను వ్యాధిగ్రస్తులకు ఇస్తున్నారు. టైప్-1, టైప్-2 షుగర్ బాధితులు తప్పనిసరిగా ఇన్సులిన్ తీసుకోవాల్సి ఉంటుంది. లేకపోతే తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి.

సరఫరా నిల్..

ఉమ్మడి అనంతపురం జిల్లాల్లోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రస్తుతం ఇన్సులిన్ నిల్వలు నిండుకున్నాయి. ఆయా ఆస్పత్రుల్లో అవసరాలను బట్టి మందుల ఇండెంట్‌ను ఏపీఎంఎస్ఐడీసీ స్టోర్‌కు పంపుతారు. ఈ మేరకు కేంద్ర కార్యాలయం నుంచి అనంతపురంలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్‌కు సరఫరా అయ్యాక.. అక్కడి నుంచి ప్రత్యేక వాహనం ద్వారా ఆస్పత్రులకు మూడు నెలలకోసారి సరఫరా చేస్తారు. అయితే, ఉమ్మడి జిల్లాలోని పలు ఆస్పత్రులకు 20 రోజుల నుంచి ఇన్సులిన్ సరఫరా నిలిచిపోయింది. దీంతో షుగర్ వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటులో సొంతంగా డబ్బులు వెచ్చిస్తూ వాయిల్స్ కొంటున్నారు. ఒక్కోసారి రూ.600 నుంచి రూ.900 దాకా ఖర్చవుతోందని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై డ్రగ్స్ స్టోర్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ సంప్రదించగా.. 20 రోజుల నుంచి వ్యాక్సిన్ సరఫరా కాలేదని ఆయన చెప్పారు. ఇండెంట్ పంపామని, త్వరలో సరఫరా అవుతాయని తెలిపారు.



కొరత లేకుండా చూస్తాం

ఆస్పత్రుల్లో ఇన్సులిన్ అవసరాలకు అనుగుణంగా సెంట్రల్ డ్రగ్స్ స్టోర్‌కు ఇండెంట్ పంపుతారు. 20 రోజులుగా బిజీగా ఉండడంతో దీనిపై దృష్టి సారించలేక పోయాం. దీనిపై డ్రగ్స్ స్టోర్ ఇన్‌చార్జ్‌తో మాట్లాడతా. కొరత లేకుండా సరఫరా చేసేలా చర్యలు చేపడతాం.

– ఈబీదేవీ, డీఎంహెచ్‌ఓ

ఆలస్యంగా నడిచిన ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు



గుత్తి: ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు శుక్రవారం 1.15 గంటలు ఆలస్యంగా నడిచింది. గుత్తి ఫోర్ట్ రైల్వే స్టేషన్‌కు ఉదయం 7.55 గంటలకు చేరుకోవాల్సి ఉండగా 1.15 గంటల ఆలస్యంగా అంటే 9.10 గంటలకు చేరుకుంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కొందరు రైలు దిగి ఆర్టీసీ బస్సులను ఆశ్రయించారు. జక్కల చెరువు రైల్వే స్టేషన్‌లో గూడ్స్ రైలు సాంకేతిక లోపం కారణంగా నిలిచిపోయింది. దీంతో ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణానికి ఆటంకం కలిగింది.

యువకుడు అదృశ్యం



వినోద్‌కుమార్

రొద్దం: నారనాగేపల్లికి చెందిన ఈడిగ సంజీవమ్మ కొడుకు ఈడిగ వినోద్‌కుమార్ (30) అదృశ్యమయ్యాడు. నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదు. ఎన్నిచోట్ల వెదికినా జాడ కానరాలేదని తల్లి సంజీవమ్మ తెలిపింది. పోలీసులలకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపింది.

దైవ దర్శనానికి వచ్చి మృత్యు ఒడికి..



మృతి చెందిన హనుమంతరాయప్ప

రొళ్ల: దైవ దర్శనం చేసుకుని.. ఆలయ ప్రాంగణంలో నిద్రించిన ఓ వృద్ధుడు మృత్యు ఒడికి చేరాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అగళి మండలం హళ్లికెర గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప (68) తన ఇంటి దేవుడైన రొళ్ల లక్ష్మీనరసింహస్వామిని గురువారం రాత్రి దర్శించుకున్నాడు. ఆలయ ఆవరణలోనే నిద్రించాడు. అయితే శుక్రవారం ఉదయం అటుగా వెళ్లిన కొందరు భక్తులు హనుమంతరాయప్పను లేపడానికి ప్రయత్నించారు. అయితే ఆయనలో చలనం లేదు. పరిశీలించి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. అరుగు కట్టపై నిద్రిస్తున్న సమయంలో జారి కిందపడడంతో ముఖానికి గాయాలై అక్కడికక్కడే మృతి చెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, వృద్ధుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

ఉద్యోగాలు హుష్‌కాకి

- 58 మంది ఎంపీహెచ్‌ఏల తొలగింపు
- ఉత్తర్వులు జారీ చేసిన వైద్య ఆరోగ్యశాఖ

అనంతపురం మెడికల్: అధికారంలోకి వస్తే ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన చంద్రబాబు.. ఆచరణలో అమలు చేయకపోగా ఉన్న ఉద్యోగాలను తీసేస్తున్నారు. తాజాగా వైద్య ఆరోగ్య శాఖలో 22 ఏళ్ల పాటు విధులు నిర్వర్తిస్తూ వచ్చిన మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ల (మేల్) (ఎంపీహెచ్ఏ-ఎం)ను విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు డీఎంహెచ్‌ఓలకు వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 58 మందిని తొలగిస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఇ.భ్రమరాంబదేవి ఉత్తర్వులు జారీ చేశారు.

తొలగింపు జాబితాలోని వారు వీరే..

అబ్దుల్ అజీజ్‌ఖాన్ (పుట్టపర్తి), కె.గంగిరెడ్డి (ఎన్‌పీ కుంట), ఎ.ధనుంజయరెడ్డి (అమడుగూరు), బి.శ్రీనివాసులు (ఓడీ చెరువు), ఎం.రమేష్‌కుమార్ (ఎన్‌పీ కుంట), ఎస్.బాబాఫక్రుద్దీన్ (రాకెట్ల), బి.అశోక్‌కుమార్‌రెడ్డి (పరిగి), ఎం.సూర్యశేఖర్ (లేపాక్షి), ఎ.విజయభాస్కర్‌రెడ్డి (కుందుర్పి), ఎ.నాగరాజు (హేమావతి), ఎం.మురళీమోహన్ (రొద్దం), ఎల్.నాగరాజు (యల్లనూరు), పి.నాగేగౌడ్ (పేరూరు), పి.రవికుమార్ (గుడిబండ), డి.మల్లికార్జున(నీలకంఠాపురం), బి.కంబగిరి స్వామి (యాడికి), శేషగిరి (రాప్తాడు), ఎస్.జబీవుల్లా (ఎద్దులపల్లి), మునిరెడ్డి (నార్పల), బి.ప్రతాప్‌రెడ్డి (బ్రహ్మసముద్రం), ఎస్.లక్ష్మినరసరెడ్డి (కంబదూరు), జె.లక్ష్మీనారాయణచారి (శెట్టూరు), కె.వాసు (గరుడుచేడు), వి.రామాంజనేయులు (కల్లుమర్రి), చౌడయ్య (రొద్దం)ను విధుల నుంచి తొలగించారు. ఇంకా సత్యనారాయణ (కంబదూరు), వెంకటరమణ (బొమ్మనహాళ్), శ్రీధర్ (గుండుమల), సుధాకర (వెంగలమ్మ చెరువు), శివరామకృష్ణారావు (విడపనకల్లు), పరశురాముడు, కె.ప్రభాకర్, హొన్నూరప్ప(రొద్దం), జె.విజయభాస్కర్‌రెడ్డి (చుక్కలూరు), సి.జయరాములు (గుంటూరు), వై.శ్రీధర్ (అమరాపురం), సి.గోవర్ధన (బొమ్మనహాళ్), ఎ.వెంకటరమణరావు (డీ హీరేహాళ్), ఎస్‌కే జాకీర్ హుస్సేన్ (నాగసముద్రం), జి.శ్రీనివాసులు (కుందుర్పి), టి.చంద్రశేఖర్ (కిష్టిపాడు), జి.సుబ్రమణ్యం (బి.పప్పూరు), ఎం సతీష్‌బాబు (కుందుర్పి), జె.రామచంద్ర (గుడిబండ), ఎన్ఎస్ నాగేంద్రకుమార్ (బొమ్మనహాళ్), ఎం .రమణానాయక్, ఎం.వెంకటరమణ, (గుడిబండ), ఎస్.మురళీకృష్ణ నాయక్ (బ్రహ్మసముద్రం), బి.నారాయణస్వామి (గుమ్మఘట్ట), కె.వెంకటసుబ్బయ్య (అగళి), జి.మదన్‌మోహన్(గరుడుచేడు), జేసీ నారాయణ నాయక్ (బ్రహ్మసముద్రం), కె.వెంకటేష్ నాయక్ (శెట్టూరు), వై శామ్యూల్ (నాగలాపురం), జి.నారాయణ (కంబదూరు), ఆర్‌కే రంగలాల్ (గుమ్మఘట్ట) తొలగించిన వారిలో ఉన్నారు.

మరో 85 మంది తొలగింపునకు రంగం సిద్ధం!

ఉమ్మడి జిల్లాలో మరో 85 మందిని రెండో దశలో తొలగింపునకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెల్సింది. ఎంపీహెచ్ఏ(ఎం)లో 40 ఏళ్ల పైబడిన వారు లేకపోలేదు. ఉన్నఫళంగా వారిని తొలగిస్తే ఈ వయసులో విధులు ఏవిధంగా చేసుకుంటారనేది పెద్ద చర్చనీయాంశమైంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఉద్యోగ సంఘాలు భగ్గుమంటున్నాయి. ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి రోడ్డున పడేయడం సరికాదని చెబుతున్నాయి.

వధువు బంగారు నగలు మాయం

- మూడు గంటల్లో ఛేదించిన పోలీసులు
- మేకప్ చేయడానికి వచ్చిన బ్యూటీషియనే దొంగ



పామిడి: ఫంక్షన్ హాలులో వధువు బంగారు ఆభరణాలు అదృశ్యమయ్యాయి. ప్రత్యామ్నాయ నగలు అలంకరించి పెళ్లి కార్యక్రమం పూర్తి చేసిన తర్వాత పోలీసులు రంగంలోకి దిగి తమదైన శైలిలో విచారణ చేశారు. మూడు గంటల వ్యవధిలోనే బంగారును రికవరీ చేశారు. వధువును అలంకరించేందుకు వచ్చిన బ్యూటీషియనే దొంగ అని గుర్తించారు. వివరాల్లోకెళితే.... రామరాజుపల్లికి చెందిన విశ్వనాథరెడ్డి కుమార్తె పెళ్లి పామిడిలోని కోగటం ఫంక్షన్‌హాలులో జరిగింది. గురువారం రాత్రి రిసెప్షన్ అంగరంగ వైభవంగా జరిగింది. శుక్రవారం ఉదయం తలంబ్రాలు. వధువుకు సంబంధించిన 28 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. నగల మాయంపై పెళ్లికి వచ్చిన బంధుమిత్రులను ఆరా తీస్తే బాధపడతారేమోనని వధువు కుటుంబ సభ్యులు మిన్నకుండిపోయారు. ప్రస్తుతానికి ప్రత్యామ్నాయ నగలతో అలంకరించి పెళ్లి ఘట్టం ముగించారు. తర్వాత స్తబ్దుగా ఉండిపోయిన వధువు తండ్రిని గమనించిన స్నేహితులు రెక్కల చిన్న నాగిరెడ్డి ఆధ్వర్యంలో రామరాజుపల్లికి చెందిన రామశేఖర్‌రెడ్డి, నాగిరెడ్డి పోలీసులకు సమాచారమందించారు. స్పందించిన సీఐ యుగంధర్ తన సిబ్బందితో ఫంక్షన్ హాలుకు చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ఆధారాలు లభించలేదు. దీంతో పెళ్లి కుమార్తె గదిని పరిశీలించారు. అక్కడ పైకప్పు పీఓపీ కొంత గ్యాప్ కనిపించింది. అక్కడేముందని చూడగా రెండు ఖాళీ నగల బాక్సులు కిందపడ్డాయి. ఇక్కడే ఏదో జరిగిందని అర్థమైంది. గదిలో ఎవరెవరు ఉన్నారు. ఎవరెవరు వచ్చి వెళ్లారు అని సీఐ ఆరా తీశారు. మేకప్ చేయడం కోసం బెంగళూరు నుంచి వచ్చిన బ్యూటీషియన్ తీరుపై అనుమానం కలగడంతో.. ఆమెను తమదైన శైలిలో విచారించడంతో అసలు విషయం బయటకొచ్చింది. తానే నగలు తస్కరించానని, వాటిని వాష్‌రూమ్‌లో ఫ్లష్‌ట్యాంకులో దాచి పెట్టిన నగలను చూపించింది. అనంతరం బ్యూటీషియన్‌పై సీఐ కేసు నమోదు చేశారు. మూడు గంటల వ్యవధిలోనే బంగారు నగలను రికవరీ చేసిన సీఐకి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా రాజేశ్వరి



జిల్లా సమాఖ్య నూతన పాలక వర్గం

పుట్టపర్తి అర్బన్: డీఆర్‌డీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పరస్పర సహాయక సహకార పొదుపు సంఘాల జిల్లా సమాఖ్య పాలకవర్గ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల పరిశీలకులుగా అనంతపురం ప్రశాంతి జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సుశీల వ్యవహరించారు. శ్రీసత్యసాయి జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా బత్తలపల్లి మండలానికి చెందిన రాజేశ్వరిని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలిగా చిలమత్తూరు లక్ష్మీదేవి, కార్యదర్శిగా తాడిమర్రి మండలానికి చెందిన సీతారామలక్ష్మి, ఉప కార్యదర్శిగా రామగిరి సుకన్య, కోశాధికారిగా నల్లమాడ వనజను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డ్వాక్రా సంఘాల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తామని, ప్రభుత్వ పథకాలను ప్రతి సభ్యురాలికీ బాధ్యతగా చేరుస్తామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమానికి జిల్లాలోని 32 మండలాల నుంచి మండలానికి ముగ్గురు చొప్పున సభ్యులు విచ్చేశారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

కదిరి టౌన్: హత్యాయత్నం కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ పరిధిలోని పార్థసారథి కాలనీలో నివాసం ఉంటున్న శివకుమార్ తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న అనుమానంతో వల్లిపి సురేష్ కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో అతడిని అంతమొందించాలని నవంబర్ 19న కత్తితోను, గడ్డపారతోనే శివకుమార్‌పై దాడిచేశాడు. శివకుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి బంధువుల ఫిర్యాదు మేరకు వల్లిపి సురేష్‌కుమార్‌పై కదిరి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. డీఎస్పీ శివనారాయణస్వామి కేసు దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుడు వల్లిపి సురేష్‌ను శుక్రవారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించడంతో నిందితుడిని అనంతపురం జిల్లా జైలుకు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

ప్రశాంతంగా రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు

గుంతకల్లు/ గుత్తి: గుంతకల్లు డివిజన్ వ్యాప్తంగా మూడురోజులుగా జరుగుతున్న రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు కేవలం రన్నింగ్ స్టాఫ్ ఉద్యోగులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. డివిజన్‌లో మొత్తం 14,359 మంది ఓటర్లు ఉండగా.. 11,509 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 86.05 శాతం పోలింగ్ నమోదైంది. ఈ నెల 12న ఓట్ల లెక్కింపు ఉంటుందని ఎన్నికల అధికారులు తెలిపారు.

ఏకపక్షం.. వివాదాస్పదం

- వెంగళమ్మ చెరువు మత్స్య సహకార సంఘం ఎన్నిక వివాదాస్పదం
- కోరం లేకుండానే ఎన్నిక.. హైకోర్టుకు వెళ్తామన్న వైఎస్సార్ సీపీ మద్దతుదారులు



ఎన్నికలను బాయ్ కాట్ చేసి బయటకు వెల్తున్న సభ్యులు

పుట్టపర్తి అర్బన్: మండలంలోని వెంగళమ్మచెరువు మత్స్య సహకార సంఘం ఎన్నికల ఏకపక్షంగా సాగింది. కేవలం కొందరికి మాత్రమే సమాచారం ఇచ్చి... వారితోనే ఎన్నిక నిర్వహించడం వివాదాస్పదమైంది. కోరం లేకుండానే ఎన్నిక పూర్తి చేయడంపై వైఎస్సార్ సీపీ మద్దతుదారులు అభ్యంతరం తెలిపారు. వివరాల్లోకి వెళితే... వెంగళమ్మచెరువు మత్స్య సహకార సంఘంలో 41 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో 22 మంది టీడీపీ మద్దతుదారులు కాగా, 17 మంది వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఉన్నారు. సంఘంలో ఎలాంటి కీలకమైన నిర్ణయం తీసుకోవాలన్నా సభ్యులందరికీ సమావేశం నిర్వహించాలి. ఇందుకు కనీసం 31 మంది హాజరు కావాలి. కానీ శుక్రవారం వెంగళమ్మచెరువు గ్రామంలోని మత్స్యకార సహకరా భవన్‌లో ఎన్నికల అధికారి శంకరయ్య ఆధ్వర్యంలో సంఘం ఎన్నికలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సభ్యులకు కనీసం నోటీసులు ఇవ్వకుండానే ప్రక్రియ నిర్వహించారు. కేవలం టీడీపీ సభ్యులకు మాత్రం సమాచారం ఇచ్చి ఎన్నిక ప్రక్రియ ఏకపక్షంగా నిర్వహించారు. విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు తమకు సంఖ్యాబలం పరంగా రెండు డైరెక్టర్ పోస్టులు ఇవ్వాలని కోరారు. ఇందుకు ఒప్పుకోక పోవడంతో వారంతా ఎన్నికలను బాయ్‌కాట్ చేసి వెళ్లిపోయారు. అయితే కోరం లేకపోయినా ఎన్నికల అధికారి శంకరయ్య ఎన్నిక ప్రక్రియ పూర్తి చేశారు. దీనిపై అభ్యంతరం తెలపిన వైఎస్సార్ సీపీ మద్దతురాలు ఎన్నికపై హైకోర్టుకు వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ సంఘానికి చాలా కాలంగా పర్సన్ ఇన్‌చార్జ్‌గా ఉన్న శంకరయ్యను ఎన్నికల అధికారిగా నియమించడంతో ఎన్నికలు ఏకపక్షంగా సాగాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. కనీసం నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా ఎన్నిక నిర్వహించడం ఎంతవరకు సబబని సభ్యులు వాపోతున్నారు.

స్థాన చలనం... అస్తవ్యస్తం

- ఖజానాలో ఇష్టారాజ్యంగా బదిలీలు



అనంతపురం అర్బన్: జిల్లా ఖజానా శాఖలో ఉద్యోగుల స్థాలచలన (బదిలీల) వ్యవహారం అస్తవ్యస్తంగా మారింది. నియమిత సీటులో కనీసం మూడేళ్ల పనిచేయాలనే నిబంధనను పాటించకూండా అందరికీ మార్పులు చేశారు. అర్హులైన వారికి నాలుగేళ్లుగా పదోన్నతులు కల్పించలేదు. ఆరుగురు ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు ఇవ్వలేదు.

నిబంధనలకు విరుద్ధంగా...

జిల్లా ఖజానా శాఖలో మొత్తం 39 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో 32 మందికి స్థానచలనం కల్పించారు. ఏడుగురు ఎస్టీఓ (సబ్ ట్రెజరీ అధికారుల)కు సీట్లు మార్చారు. 22 మంది ఎస్ఏ (సీనియర్ అకౌంటెంట్)లు ఉండగా 18 మందికి, 9 మంది జేఏ (జూనియర్ అకౌంటెంట్)లు ఉండగా ఏడుగురికి సీట్లు మార్చారు. స్థానచలనం పొందిన ఉద్యోగుల్లో చాలామంది ఒకే స్థానంలో మూడేళ్లు పనిచేసిన వారు తక్కువగా ఉన్నారు. మూడేళ్ల నిబంధనను పక్కనపెట్టి స్థానచలనం కల్పించారని చెబుతున్నారు. పరిపాలన (అడ్మినిస్ట్రేషన్) విభాగంలో ఇలాంటిదే చోటు చేసుకుందని అంటున్నారు. ఈ విభాగంలో ఏ2 సీటుకు నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల వ్యవహారాలు, మునిసిపల్, వాణిజ్య పనుల శాఖల పద్దులు కేటాయించారని పేర్కొంటున్నారు. తాజాగా జరిగిన స్థానం చలనంలో ఏ2 నుంచి మునిసిపల్, వాణిజ్య శాఖలను తొలగించారు. స్థానంచలనం కల్పించినప్పుడు యథావిధిగా విధులు ఉండాలే తప్ప.... కేటాయించిన వాటిలో కొన్ని విధులను తొలగించడం ఏమిటని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

పదోన్నతులకు నోచుకోక..

ఖజానా శాఖ పరిధిలో కొందరు ఉద్యోగులు అర్హత ఉన్నప్పటికీ నాలుగేళ్లుగా పదోన్నతికి నోచుకోలేదు. ఇంకొందరు ఉద్యోగులు ప్రభుత్వ నిబంధనల మేరకు పరీక్షలో ఉత్తీర్ణత సాధించి 2020లోనే అర్హత పొందినా... ఇప్పటికీ ఇంక్రిమెంట్లు కలపలేదు. తద్వారా ఆ ఉద్యోగులు వారి సర్వీసులో చాలా నష్టపోతున్నారని ఆ శాఖ వర్గాలే చెబుతున్నాయి.

ఆదేశాల మేరకే మార్పులు



ఒక సీటులో మూడేళ్లు ఉంచాలనే నిబంధన ఉంది. అయితే పై అధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు అందరికీ సీట్లు మార్చుచేశాము. అడ్మినిస్ట్రేషన్ విభాగానికి బిల్లుల వ్యవహారం ఉండకూదనే ఉద్దేశంతో ఏ2 సీటుకు ఇప్పటి వరకు ఉన్న శాఖలను తీసివేశాం. సాంకేతిక కారణాల వల్ల ఉద్యోగులకు పదోన్నతులు, ఇంక్రిమెంట్లు కల్పించలేదు.

– సరళ విజయకుమారి, డిప్యూటీ డైరెక్టర్, ఖజానాశాఖ

సమన్వయంతోనే సమగ్రాభివృద్ధి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ. చిత్రంలో సీఈఓ వెంకటసుబ్బయ్య, ఇతర అధికారులు

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం ఉన్నప్పుడే పంచాయతీల్లో సమగ్రాభివృద్ధి సాధించడం సులభమవుతుందని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. 'స్థానికీకరణ – సుస్థిర అభివృద్ధి లక్ష్య సాధన'లో భాగంగా రాష్ట్ర గ్రామ స్వరాజ్య అభియాన్ (ఆర్‌జీఎస్ఏ) నిధుల వినియోగంపై అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ భవన్‌లో రెండు రోజులపాటు నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఒక్కో మండలం నుంచి ఆరుగురు ఉద్యోగులు చొప్పున ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 63 మండలాలకు చెందిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఎంపీహెచ్‌ఓలు, ఈఓపీఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు హాజరయ్యారు. ముగింపు సభకు జెడ్పీ సీఈఓ జి.వెంకటసుబ్బయ్య అధ్యక్షత వహించగా, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే నిధులతో పాటు స్థానికంగా ఆదాయ వనరులను పెంచుకునేందుకు గల అవకాశాలు అన్వేషించి, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆ తరువాత అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అందులో ప్రాధాన్య క్రమంలో సమస్యలను గుర్తించి, వాటి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా రహదారులు, మురుగు కాలువలు, వీధి దీపాలు, తాగునీటి అవసరాలు, అంగన్‌వాడీ, పాఠశాలలకు పక్కా భవనాలు, ప్రభుత్వ భవనాల మరమ్మతులు ఇలా.. అన్ని అంశాలనూ పరిశీలించి, వాటి పరిష్కారానికి నివేదికలు రూపొందించాలని పేర్కొన్నారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను మండలాలకు వెళ్లి క్షేత్రస్థాయి అధికారులకు మళ్లీ శిక్షణ ఇచ్చి, తర్ఫీదునివ్వాలని సీఈఓ వెంకటసుబ్బయ్య ఆదేశించారు. శిక్షణ తరగతులకు పరిశీలకురాలిగా శ్రీకాళహస్తి నుంచి వచ్చిన రూపారాణి అనే అంశాల గురించి వివరించారు.